గోవింద్ ఫోన్ ఎత్తి అన్నాడు "హలో.. ఎవరూ మాట్లాడుతూంట?" అవతల నుంచి ఒక స్త్రీ కంఠం.

"నా హృదయం! నేను నళినిని. నేను మిమ్మల్ని గాఢంగా ప్రేమిస్తున్నాను."

"నన్నా.... మీరెవరో నా కసలు తెలియదే!"

"అవును. కాని మీరు నాకు బాగా తెలుసు. మీరు రోజూ పార్కుకి వస్తుంటారు. నేను కారులో కూర్చుని మిమ్మల్నే చూస్తుంటాను...."

"మీకు కారుందా...."

"ఒకటికాదు. రెండో.మూడోవున్నాయి. మా నాన్న పెద్ద బిజినెస్‌మాన్. అవునూ మిమ్మల్ని పట్టుకుని ఎవరో అమ్మాయి వేళ్ళాడుతూంటుంది. ఎవరూ?"

"ఎవరోలెండి. పరిచయస్తురాలు. అంతే!"

"అంతేనా, అయితే ఫరవాలేదు! నేను మిమ్మల్ని సీరియస్‌గా ప్రేమిస్తున్నాను. మానాన్నకి ఒక్కర్తే కూతుర్ని. చచ్చినంత ఆస్తుంది. యివాళ సాయంత్రం 7 గంటలకి హోటల్ కాసినో. థర్డ్ ఫ్లోర్ టేబిల్ నెం. 5 దగ్గర మనిద్దరికీ డిన్నర్. తప్పక రండి - అన్ని విషయాలూ మాట్లాడుకుందాం."

గోవింద్ ఉబ్బి తబ్బిబ్బైపోయాడు. తను పక్కింటి శాంతతో ఏవో చవకబారు ప్రేమ ప్రమాణాలు చేస్తున్నాడు రోజూ. తన నిలాగ అందం. ఐశ్వర్యం తరుముకుంటూ వస్తుందని తనకేం తెలుసు! సబ్బంతా అరగదీసి స్నానంచేసి వచ్చాడు గోవిందరావు. మళ్ళీ ఫోను మోగింది. ఒక్క గంతులో వెళ్ళి రిసీవరు ఎత్తాడు.




"హల్లో...." శాంత కంఠం. గోవింద్ నీరసపడిపోయాడు.

"ఇవాళ బీచ్‌కి వస్తానన్నావు కదూ గోవింద్. క్షణాలు లెక్కపెడుతున్నాను. ఓ సారి గుర్తుచేద్దామని...."

"కానీ....శాంతా. ఇవాల్టికి క్షమించు. నేను రాలేను."

"నువ్వు రాందే నేను బ్రతకలేను. రావాలి."

"అది కాదు శాంతా. నా ఫ్రెండ్‌కి యాక్సిడెంటయింది. అతన్ని చూడాలి."

"ఇప్పుడే వెళ్లి చూసి వచ్చెయ్యి."

"సాయంత్రం ఏడుగంటలకి వస్తానని ప్రామిస్ చేశాను."

"అప్పటిదాకా బతికే వుంటానని మీ ఫ్రెండ్ ప్రామిస్ చేశాడా?"

"నన్ను మిస్ అండర్‌స్టాండ్ చేసుకోకు. అతని దంత పెద్ద యాక్సిడెంటు కాదు."

"గోవింద్. నిన్ను సరిగ్గా అండర్‌స్టాండ్ చేసుకున్నాను, నీ ఫ్రెండ్‌కి జరిగిన యాక్సిడెంటులో నీ ప్రేమకి పెద్ద యాక్సిడెంటయి చచ్చిపోయింది. కావాలంటే సాయంత్రం హోటల్ కాసినోలో థర్డ్ ఫ్లోర్ టేబిల్ నెం. 5 దగ్గర నళినిని అడుగు."

గోవింద్ కళ్ళు తేలేసి కిటికీలోంచి చూశాడు. ఎదురుగా మేడ మీద వాళ్ళింట్లో రిసీవర్ పెట్టేస్తూ శాంత, ఆమె స్నేహితురాలు విరగబడి నవ్వుతూ కనిపించారు.

---

డియర్ బెటర్ హాఫ్. చాలా థాంక్సు బాబును కనినందుకు. మన ఇరువురి కోరిక నెరవేరింది కదూ. కాని నీకు అవరేషన్. నీవు ఎంత అవస్థ పడ్డావో ఊహించుకొనినపుడు స్త్రీ జాతి మీద ఎంతటి కర్కోటకునికైనా సానుభూతి కలుగుతుంది. నీకు కుట్లు విప్పి నొప్పి మానేవరకు- అంటే దాదాపు రెండు నెలలు మీ తల్లిగారింట్లోనే ఉంటావని చెప్పావు కదూ! అంతవరకు ఒంటరిగా నేనెలా గడపాలి డియర్? గత స్మృతులు నెమరువేసుకుంటూ అర్ధరాత్రి వరకూ అగచాట్లుపడవల్సిందేనా? నాకు ఇక్కడవంటకు చాలాఇబ్బంది అవుతున్నది. అన్నట్లు మనప్రక్కింటి నీ సోకాల్డ్ కాలేజీకి వెళ్ళే సిస్టర్ ప్రియ వచ్చి కూర వండి పెడ్తున్నది. కాఫీ. అన్నం నేనే చేసుకుంటున్నాననుకో. మొన్నొకరోజు ఏమైందో తెలుసా. ఆ అమ్మాయి నాయనమ్మకు సీరియస్‌గా ఉందని టెలిగ్రాం వస్తే ఆమె తండ్రి తల్లి వెంబడే గ్రామం వెడ్తూ వారి ఇంటి తాళపు చెవి నాకిచ్చి వెళ్ళారు. కాలేజీ నుంచి ప్రియరాగానే సంగతి తెల్పి బెంబేలుపడి ఒంటరిగా ఆ ఇంట్లోవుంటే భయమేస్తుందని మన ఇంట్లోనే ఇద్దరికీ అన్నం వండింది. ఆ రోజు వర్షం. మన ఇంట్లోనే పడుకుంటానంటుంది. నాకు ఎటూ తోచలేదు, భోజనాలు ముగించాక ఒక గంటసేపు ఆ అమ్మాయి వాళ్ళ నాయనమ్మ జీవిత విశే




షాలు చెప్పింది. వేరే రూంలో పడుకోమంటే భయమేస్తుందని మన బెడ్‌రూంలోనే మంచం వేసుకుని పడుకున్నది. నాకు నిద్ర పట్టదు. నిమిషానికి వేల ఆలోచనలు. అవతలికి పోయి వద్దామనే ఉద్దేశంతో లైటు వేశాను. మంచంలో నిద్రపోతున్న ప్రియ. పైట తొలగి.... వర్ణించలేను. కూడదు కూడా. చెడు తలంపును కంట్రోలు చేసుకోలేక పోయా. ఆవిడ మంచం వద్దకు వెళ్ళాను. ఎందుకో అకస్మాత్తుగా ఆవిడ తండ్రి దీనావస్థలో నా కళ్ళ ముందు మెదిలాడు. వెంటనే తలుపు తీసుకుని బయటకు వెళ్ళి ఆకాశంలోకి చూస్తూ ఆలోచించసాగాను. నీ దిక్కడ ఉన్నప్పుడు వాడగా మిగిలిన నిద్ర మాత్రలు అయిడియాకి వచ్చాయి. వెళ్ళి రెండు మాత్రలు వేసుకుని బలవంతంగా కళ్ళు మూసుకున్నా. తెల్లవారి లేచేసరికి టైం ఏడున్నర అయింది. ప్రక్క మంచం వైపుచూస్తే ప్రియ వెళ్ళిపోయింది. ఎనిమిన్నర వరకల్లా ఆమె తల్లి తండ్రి ముసలావిడకు నెమ్మదించడంతో వచ్చారు. నా కో-ఆపరేషన్‌కు కృతజ్ఞత తెలిపారు. కాని నేను పడిన బాధ వారికేం తెలుసు. ఈ ఉత్తరం ముట్టగానే నీవు ఏదో కొంపలు మునిగిపోతాయని బయలుదేరకు. నా మీద నీకు విశ్వాసం ఉంటుందని ఆశిస్తూ.

నీ డియర్
శంకర్.